
విద్యార్థులకు అవగాహన సదస్సు



కీసర: వాహనదారులు ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని ట్రాఫిక్ సీఐ అర్జున్ అన్నారు. మంగళవారం జాతీయ రహదారి భద్రత మాసం కార్యక్రమంలో భాగంగా కీసరలోని స్ఫూర్తి డిగ్రీ కళాశాల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హెల్మెట్, సీట్ బెల్ట్ పెట్టుకొని వాహనాలను నడపాలన్నారు. విద్యార్థులకు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ ఎండీ, నర్సింహ్మారావు, ఏఎస్ఐ రవికుమార్, నేతలు గణేష్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



కీసర: నాగారం మున్సిపాలిటీలోని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయడం జరుగుతుందని నాగారం మున్సిపల్ చైర్మన్ కొకుట్లచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని 16వ వార్డులో సుమారు 6 లక్షల మున్సిపల్ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బండారి మల్లేష్‌యాదవ్, కౌన్సిలర్లు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నిహాక్ స్కూల్‌కు చాంపియన్‌షిప్ ట్రోఫీ



ట్రోఫీతో విద్యార్థులు

పోచారం: సరూర్‌నగర్‌లోని ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన వైట్ బెల్ట్ ఇన్ కరాటే పోటీల్లో స్కూల్ చాంపియన్‌షిప్ ట్రోఫీని కాచవానిసింగారంలోని నిహాక్ ఇంటర్నేషనల్ స్కూల్ సాధించింది. ఈ పాఠశాల నుంచి పోటీల్లో పాల్గొన్న వారిలో మొత్తం 17 మంది విద్యార్థులు పతకాలను గెలుచుకున్నారు. వీరిలో నలుగురికి బంగారు పతకాలు, ఒకరికి రజిత పతకం, 12 మందికి కాంస్య పతకాలు లభించాయి. విద్యార్థులకు కరాటేలో శిక్షణనిచ్చిన శివతో పాటు విజేతలను స్కూల్ యాజమాన్యం అభినందించింది.

అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి



సమావేశంలో నాయకులు, పోలీసులు

మేడ్చల్: జాతీయ రహదారిపై మేడ్చల్ పట్టణంలో ఉన్న అంబేడ్కర్ విగ్రహాన్ని రోడ్డుకు అడ్డంగా లేకుండా అదే ప్రాంతంలో ఉంచాలని మండల దళిత నాయకులు, దళిత సంఘాల నాయకులు సూచించారు. జాతీయ రహదారి విస్తరణలో భాగంగా అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు పై ట్రాఫిక్ ఏసీపీ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నాయకులు పలు సూచనలు చేశారు. జాతీయ రహదారిపై అత్వెల్లి వద్ద తొలగించిన అంబేడ్కర్ విగ్రహాన్ని తిరిగి ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో ట్రాఫిక్ సీఐ హనుమాన్‌గౌడ్, లా అండ్ ఆర్డర్ సీఐ సత్యనారాయణ, కౌన్సిలర్ దేవ, మాజీ సర్పంచ్ ఈశ్వర్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సత్యనారాయణ, కాంగ్రెస్ నాయకుడు మహేష్, నాగభూషణం, బీజేపీ నాయకులు అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలీ సంఘం ఆర్గనైజర్ సెక్రటరీగా దేవేందర్

బోడుప్పల్: బోడుప్పల్‌కు చెందిన ఎలివేటి దేవేందర్ తెలంగాణ రాష్ట్ర పద్మశాలీ సంఘం ఆర్గనైజర్ సెక్రటరీగా నియమితులయ్యారు. ఈ మేరకు అధ్యక్షుడు రాజ్‌కుమార్ చేతుల మీదుగా నియామకపత్రాన్ని అందుకున్నారు. నాయకులు లోకేష్, శ్రీనివాస్, వెంకటేష్ తదితరులు ఆయనను సత్కరించారు.

షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణంపై నిర్లక్ష్యమేల?

- నిధుల లేమితో అసంపూర్తిగా మిగిలిన భవనం
- అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారిన వైనం
- పట్టించుకోని ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వం



ఘట్‌కేసర్‌లో అసంపూర్తి దశలో షాపింగ్ కాంప్లెక్స్ భవనం

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్‌కు వెళ్లే దారిలో నిర్మిస్తున్న దుకాణ సముదాయం పనులు నిధుల లేమితో అర్థాంతరంగా నిలిచిపోయాయి. దీంతో అసంపూర్తిగా ఉన్న భవనం అసాంఘిక కార్యకలపాలకు నిలయంగా మారింది. ఇక్కడ జరుగుతున్న వ్యవహారాలకు ప్రశ్నిస్తే బెదిరిస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ స్థలంలో దశాబ్దాల క్రితం నిర్మించిన ప్రభుత్వ అతిథి గృహం ఉండేది. అందులో ఎంపీడీఓ కార్యాలయం, పోలీస్‌స్టేషన్, సాంఘిక సంక్షేమ వసతిగృహం నిర్వహించారు. ఎందరో ఉన్నతాధికారులు ఈ భవనంలో బసచేసి తిరుగు ప్రయాణం అయ్యేవారని స్థానికులు చెబుతున్నారు. రాజకీయ పార్టీలు, విద్యార్థి, కుల సంఘాల వారు సమావేశాలు నిర్వహించే వారు. అతిథిగృహం శిథిలం కావడంతో కొత్తగా దుకాణ సముదాయం నిర్మించాలనుకున్నారు. జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ పట్నం సునీతామహేందర్‌రెడ్డి, మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి 2018, డిసెంబర్ 29న షాపింగ్ కాంప్లెక్స్ భవనానికి శంకుస్థాపన చేశారు. ఇప్పటి వరకు రూ.80 లక్షలు పైగా మండల, జెడ్పీ నిధులు వెచ్చించి రెండంతస్తులు స్లాబ్ వేసి వదిలిపెట్టారు. ఆ తర్వాత పనులు ముందుకు సాగడం లేదు.

పట్టించుకునే దిక్కే లేదు..

సగం నిర్మించి వదిలేసిన భవనాన్ని అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడం లేదు. దీంతో ఈ అసంపూర్తి భవనం తాగుబోతులు, అసాంఘిక శక్తులకు అడ్డాగా మారిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. దశాబ్దాలుగా సేవలందించిన స్థలంలో ప్రస్తుతం పేకాట, మద్యం సేవించడం, ప్రైవేటు వాహనాల పార్కింగ్‌కు నిలయంగా మారింది. దుకాణ సముదాయం నిర్మించి అద్దెకిస్తే ఆదాయం వచ్చే అవకాశం ఉన్నా..నిధుల కొరతతో పనులు ముందుకు సాగడం లేదని ప్రజలు అంటున్నారు. రైల్వేస్టేషన్ రోడ్డు వ్యాపారాలకు మారుపేరు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి..ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని దుకాణ సముదాయాన్ని త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని కోరుతున్నారు.

ప్రజలకు అందుబాటులోకి తేవాలి...



అంసపూర్తిగా ఉన్న కమర్షియల్ కాంప్లెక్స్ వల్ల స్థానికులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పనులు సగంలోనే వదిలివేయడంతో అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. వెంటనే పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలి.

–ప్రవీణ్‌రావు, బీజేపీ మండల అధ్యక్షుడు

నిధులు కేటాయించాలి



ప్రజల సౌకర్యం కోసం నిర్మించిన భవన సముదాయం పనులు అసంపూర్తిగా మిగిలాయి. నిధులు లేకపోవడతో పనులు జరగడం లేదు. భవనం పనులు పూర్తి కావడానికి అవసరమైన నిధులు కేటాయించాలి.

– మంకయ్య, మర్పల్లిగూడ, ఘట్‌కేసర్ మున్సిపాలిటీ

మున్సిపాలిటీ ఆదాయం పెంచాలి..



వృథాగా ఉన్న భవనం పనులు త్వరగా పూర్తి చేయాలి. సంవత్సరాలుగా ఎదురు చూస్తున్న ప్రజల కోరిక మేరకు ప్రజలకు అందుబాటులోకి తెచ్చి అద్దెకివ్వాలి. తద్వారా మున్సిపల్ ఆదాయం పెంచాలి.

– కిరణ్, ఎన్ఎఫ్‌సీనగర్ ఘట్‌కేసర్ మున్సిపాలిటీ

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఘట్‌కేసర్: విద్యుత్ లైన్‌ల మరమ్మతుల కారణంగా కొండాపూర్ 33/11కేవీ సబ్‌స్టేషన్, సింగరేణి 11కేవీ ఫీడర్ పరిధిలో బుధవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కొండాపూర్, సింగరేణి కాలనీ, అవుషాపూర్, ఎచ్‌పీసీఎల్ సర్వీస్ రోడ్డు, పటేల్ నగర్ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఘట్‌కేసర్ ఏఈ యశ్వంత్ కుమార్‌రెడ్డి తెలిపారు.

సెల్‌ఫోన్ అప్పగించి నిజాయితీని చాటుకున్న వ్యక్తి



జవహర్‌నగర్: రోడ్డుపై దొరికిన సెల్‌ఫోన్‌ను ఓ యువకుడు పోలీసులకు అప్పగించి తన నిజాయితీని చాటుకున్న ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని లక్ష్మినర్సింహాకాలనీలో నివసించే యువకుడు రావిల వంశీ ప్రధాన రహదారిలో నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఈ క్రమంలో రోడ్డుపై సెల్‌ఫోన్ అతనికి దొరికింది. వెంటనే అతను పోలీస్‌స్టేషన్‌కు వచ్చి దాదాపు 20వేల రూపాయల సెల్‌ఫోన్‌ను పోలీసులకు అప్పగించాడు. నిజాయితీని చాటుకున్న యువకుడు వంశీని సీఐ సైదయ్య అభినందించాడు. సెల్‌ఫోన్ పోగొట్టుకున్న వారు పోలీసులను ఆశ్రయించాలని తెలిపారు.

రైల్వే వంతెన పనులు చేయించాలని ఎమ్మెల్యేకు వినతి



ఎమ్మెల్యే మల్లారెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న అఖిల పక్ష నాయకులు

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్‌లో నిర్మిస్తున్న రైల్వే వంతెన పనులు త్వరితగతిన పూర్తి చేయించాలని జేఏసీ ఆధ్వర్యంలో మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డికి ఆయన నివాసంలో మంగళవారం వినతి పత్రం అందజేశారు. కాంట్రాక్టర్‌కు రావలసిన బిల్లులు, భూబాధితులకు నష్టపరిహారం త్వరగా ఇప్పించాలని, ఆర్టీసీ బస్సుల రాకపోకలకు దారి సుగమం చేయాలని, 60 గజాల ఇంటి స్థలం కేటాయించాలని, ఉప్పల్ నుంచి ఘట్‌కేసర్ వరకు మెట్రో రైలును విస్తరించాలని లేఖలో కోరారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు, కలెక్టర్ గౌతమ్‌తో మాట్లాడారు. త్వరలో సీఎంను జేఏసీ ఆధ్వర్యంలో కలిసేందుకు కృషి చేస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ లక్ష్మారెడ్డి, ఎఫ్ఎస్‌సీఎస్ డైరెక్టర్ లక్ష్మారెడ్డి, అఖిలపక్ష నాయకులు మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్, యాదయ్య, సబిత, ప్రమోద్‌గుప్తా, జంగయ్య, నగేష్‌గుప్తా, విజయగౌడ్ కమలాకర్, సిరాజ్, సదానంద్, అశోక్‌గౌడ్ పాల్గొన్నారు.

పట్టణ అభివృద్ధినే కౌన్సిల్ లక్ష్యం



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న చైర్ పర్సన్, నాయకులు

మేడ్చల్: మేడ్చల్ పట్టణ సమగ్ర అభివృద్ధినే మేడ్చల్ మున్సిపల్ కౌన్సిల్ లక్ష్యమని మున్సిపల్ చైర్ పర్సన్ మర్రి దీపికనరసింహారెడ్డి అన్నారు. పట్టణంలోని 12వ వార్డులో ఆమె కౌన్సిలర్ బత్తుల ప్రియాంక మధుకర్ యాదవ్‌తో కలిసి పార్కు, ఓపెన్ జిమ్, సీసీ రోడ్డు తదితర అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పట్టణ అభివృద్ధినే లక్ష్యంగా కౌన్సిల్ గత ఐదు సంవత్సరాలుగా పని చేస్తోందని అన్నారు. 23 వార్డులను సమగ్రంగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. సీసీ, బీటీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, వీధీ దీపాలు వంటి మౌలిక వసతులు కలిపించామన్నారు. 12వ వార్డును సంపూర్ణంగా అభివృద్ధి చేశామని అన్నారు. కార్యక్రమంలో కమిషనర్ నాగిరెడ్డి, డీఈ విజయలక్ష్మి, మాజీ జెడ్పీటీసీ శైలజ హరినాథ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సత్యనారయణ, పట్టణ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు వేముల శ్రీనివాస్‌రెడ్డి, సంజీవరావు, సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు పరికరాల పంపిణీ





కేలండర్ ఆవిష్కరణలో మేయర్ అజయ్‌యాదవ్

బోడుప్పల్: మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు మేయర్ అజయ్‌యాదవ్, కమిషనర్ రామలింగం భద్రత పరికరాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. నగర పాలక సంస్థ పరిధిలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో కార్మికులు కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. వారి భద్రతకు నగర పాలక సంస్థ తగిన చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. స్థానిక నేతలు వెంకటేష్ గుప్తా, పులకండ్ల జంగారెడ్డి, దానగల్ల యాదగిరి, కృపాసాగర్ పాల్గొన్నారు.

ముదిరాజ్ సంఘం కేలండర్ ఆవిష్కరణ..

బోడుప్పల్: ముదిరాజ్ కులస్తులు అన్ని రంగాల్లో రాణించాలని బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్ అన్నారు. న్యూ హేమానగర్ ముదిరాజ్ సంఘం 2025 కేలండర్‌ను మేయర్ ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించారు. ముదిరాజ్ సంఘం భవన నిర్మాణానికి ప్రభుత్వం స్థలం కేటాయించాలని సంఘం ప్రతినిధులు ఆయనకు వినతిపత్రం అందజేశారు. డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిశోర్‌గౌడ్, కార్పొరేటర్లు బొమ్మక్ సుగుణ బాలయ్య, మహేశ్వరి కృపాసాగర్, సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు ఆనందబాబు, అధ్యక్షులు మన్నె అంజయ్య , ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ సురేష్ పాల్గొన్నారు.

తులం బంగారం హామీ నిలబెట్టుకోవాలి

ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

కాప్రా: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన తులం బంగారం హామీ అమలు చేసి మాట నిలబెట్టుకోవాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం కాప్రా తహసీల్దార్ కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. కాప్రా మండల పరిధిలోని 75 మందికి చెక్కులను అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేదింటి ఆడబిడ్డల పెళ్లికి గత ప్రభుత్వం రూ.1,00,116 అందించిందని, ప్రస్తుత ప్రభుత్వం దీనికి తోడు ఆడబిడ్డలకు తులం బంగారం ఇస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. హామీలు నెలబెట్టుకుంటే పేదింటి ఆడబిడ్డలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. తహసీల్దార్ సుచరిత, కార్పొరేటర్లు స్వర్ణరాజ్ శివమణి, బొంతు శ్రీదేవి, బీఆర్ఎస్ నేతలు కాసం మహిపాల్‌రెడ్డి, బైరి నవీన్‌గౌడ్, స్థానిక నేతలు పాల్గొన్నారు.

బాలలకు అండగా నిలుద్దాం: రాధికా గుప్తా

సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని వివిధ శాఖల అధికారులు సమన్వయంతో బాలల రక్షణకు పూర్తి స్థాయిలో సహకారం అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీ) రాధికా గుప్తా కోరారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఆపరేషన్ స్మైల్ కార్యక్రమంలో భాగంగా సంబంధిత అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. 14 సంవత్సరాల లోపు ఉన్న బాలలను వివిధ పారిశ్రామిక వాడల్లో కార్మికులుగా పని చేయించినా లేదా భిక్షాటన చేయించినా చట్టపరమైన చర్యలు ఉంటాయని అదనపు కలెక్టర్ హెచ్చరించారు. ఇందులో డీఎంహెచ్ఓ డాక్టరు రఘునాథ్‌స్వామి, జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి స్వర్ణలత, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ మెంబర్ రామ్మోహన్, బాల రక్ష భవన్ కోఆర్డినేటర్ నాగమణి, జిల్లా బాలల పరిరక్షణ అధికారి ఎండి ఇంతియాజ్ రహీం, రెవెన్యూ, పోలీసు అధికారులు, జిల్లా బాలల పరిరక్షణ విభాగం సభ్యులు, చైల్డ్ లైన్ సభ్యులు, వివిధ శాఖల అధికారులు, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

కుట్టు మిషన్ల పంపిణీ



కుషాయిగూడ: కాప్రా సర్కిల్ వాసవీ క్లబ్, వనిత క్లబ్, కపుల్స్ క్లబ్‌ల ఆధ్వర్యంలో 2024లో నిర్వహించిన సీడ్ బాల్స్ కార్యక్రమంలో భాగంగా సమకూర్చిన 3 కుట్టుమిషన్లను పేద మహిళల అందజేశారు. ఓ పేదింటి అమ్మాయి చదువుకు రూ.5 వేల ఆర్థికసాయం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేదలకు తమవంతు సాయం చేయాలనే ఉద్దేశ్యంతో క్లబ్‌లను ఏర్పాటు చేశామన్నారు. భవిష్యత్తులో సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేస్తామన్నారు. వాసవీ క్లబ్, వనిత క్లబ్, కపుల్స్ క్లబ్ జిల్లా ఇన్‌చార్జ్‌లు బానురి నర్సింహులు, బెజగం రాజేశ్వరరావు, సభ్యులు ఎన్.శ్రీనివాస్, సీహెచ్. శ్రీనివాసులు, కృష్ణమూర్తి, సదానందం, భాగ్యలక్ష్మి, సూర్యప్రకాష్, రమేష్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస పాఠాలు

ఉప్పల్: ఉప్పల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంపాక్ట్ ఫౌండేషన్ నుంచి నిపుణులు మోహన్‌పాటిల్, మాచపల్లి బాపురావ్‌లు మంగళవారం విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస పాఠాలు నేర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిజాయితీ, చిత్తశుద్ధి, విశ్వాసం, కలిసి పనిచేసేలా ఇతరులను ప్రేరేపించడం లాంటి అంశాల్లో విద్యార్థులకు తర్ఫీదును ఇచ్చారు. ప్రిన్సిపాల్ డా. విజయ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ డా. రవిప్రసాద్, సమన్వయకర్త విశ్వనాథ్‌కుమార్ పాల్గొన్నారు.

అందరి సహకారంతో స్వచ్ఛ సర్వేక్షణ్ జాతీయ అవార్డు

అందరి సహకారంతో 'స్వచ్ఛ సర్వేక్షణ్ జాతీయ' అవార్డు సాధించాం



సమావేశంలో మాట్లాడుతున్న చైర్ పర్సన్ పావనీజంగయ్య

ఘట్‌కేసర్: అందరి సహకారంతో స్వచ్ఛ సర్వేక్షణ్ జాతీయ స్థాయి అవార్డును వరుసగా మూడు సార్లు సాధించామని మున్సిపల్ చైర్ పర్సన్ పావనీజంగయ్య అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో చైర్ పర్సన్ అధ్యక్షతన, కమిషనర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో మంగళవారం కౌన్సిల్ సమావేశం నిర్వహించి రూ. 6.8 కోట్ల బడ్జెట్‌తో అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ.. విలీన గ్రామాలతో సహ మున్సిపాలిటీలో 4.1 కోట్లతో సీసీ రోడ్లు, 1.2 కోట్లతో డ్రైనేజీలు, రూ. 25 లక్షలతో మంచినీటి పైపులైన్ పనులు, రూ. 22 లక్షలతో ఓపెన్‌జిమ్, రోడ్డు మరమ్మతులకు రూ. 15 లక్షలు, వీధి లైట్ల కోసం రూ. 10 లక్షలు, వాహనాల నిర్వాహణ రూ. 10 లక్షలు, ఇతర పనుల కోసం రూ. 68 లక్షలు కేటాయించామన్నారు. మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు చేపడతామన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్ మాధవరెడ్డి, కౌన్సిలర్లు వెంకట్‌రెడ్డి, రమాదేవి, సంగీత, ఆంజనేయులుగౌడ్, అనురాధా, సుల్తానా, నాగజ్యోతి, శశికళ, మల్లేష్, పద్మారావు, కోఆప్షన్ సభ్యులు అరుణ, సురేందర్‌రెడ్డి, ఏఈ రాకేష్, మేనేజర్ వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతు సేవా సహకార సంఘం సందర్శన



శామీర్‌పేట్: శామీర్‌పేటలోని రైతు సేవా సహకార సంఘం కార్యాలయాన్ని మంగళవారం ఒరిస్సా రాష్ట్రానికి చెందిన రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి కో–ఆపరేటివ్ అధికారుల బృందం సందర్శించారు. నాబార్డు ఆధ్వర్యంలో ఎంపిక చేసిన శామీర్‌పేట, మల్కనూరు సొసైటీ సంఘాలను ఎంపిక చేయగా నిర్వాహణను అధ్యాయనం చేయడానికి సందర్శించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సొసైటీ ఆధ్వర్యంలో రైతులకు అందిస్తున్న సేవలు, సొసైటీ అభివృద్ధిపై డీసీఎంఎస్ వైస్‌చైర్మన్ మధుకర్‌రెడ్డి వారికి తెలిపారు. రైతుల సభ్యత్వం, ఋణాల మంజూరు, లాకర్ల వినియోగం, దీర్ఘకాలిక ఋణాలు, వరి ధాన్యానికి మద్దతు తదితర అంశాలు ఒరిస్సా బృందానికి వివరించారు. ఈ కార్యక్రమంలో శామీర్‌పేట సొసైటీ వైస్‌చైర్మన్ ఐలయ్య, డైరెక్టర్ భూమిరెడ్డి, సీఈఓ నర్సింహులు, ఒరిస్సా అధికారుల బృందం తదితరులు పాల్గొన్నారు.

బీసీ డిక్లరేషన్ హామీని వెంటనే అమలు చేయాలి



తహసీల్దార్ సుచరితకు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

జవహర్‌నగర్ : కామారెడ్డి బీసీ డిక్లరేషన్ హామీని ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని బీజేపీ ఓబీసీ మోర్చా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు మహేందర్‌యాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా, స్థానిక నాయకులతో కలిసి కాప్రా తహసీల్దార్ సుచరితకు వినతిపత్రాన్ని మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా మహేందర్‌యాదవ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఏడాది పాలనలో ఒక్కహామీని అమలుపరచలేకపోయిందన్నారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ హామీని వెంటనే అమలుచేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కలిప్పించాలన్నారు. బీసీలను కాంగ్రెస్ ఓటు బ్యాంకుగానే వాడుకుంటుదన్నారు. డిక్లరేషన్ అమలు చేయకుంటే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జవహర్‌నగర్ అధ్యక్షుడు కమల్, సీనియర్ నాయకులు అశోక్‌గౌడ్, భిక్షపతి, రామునాయక్, సందీప్‌ముదిరాజ్, యాదగిరి, జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

కారులో సజీవ దహనమైన మృతుల అంత్యక్రియలు పూర్తి



విలపిస్తున్న మృతురాలి బంధువులు



ధర్నా చేస్తున్న దృశ్యం

పోచారం: ఘట్‌కేసర్‌లోని ఓఆర్‌ఆర్ సర్వీస్ రోడ్డు వద్ద కారులో శ్రీరాములు (25), బాలిక (16) సజీవ దహనమైన విషయం తెలిసిందే. మంగళవారం పోస్టుమార్టం అనంతరం శ్రీరాములు మృతదేహాన్ని భూదాన్ పోచాంపల్లి మండలంలోని స్వగ్రామమైన పిల్వాయిపల్లికి తీసుకెళ్లి అంత్యక్రియలు నిర్వహించారు. కాగా, వీరి చావుకు చింటు అనే వ్యక్తే కారణమంటూ బాలిక బంధువులు ఆరోపిస్తూ.. బాలిక మృతదేహంతో మంగళవారం పోచారం మున్సిపాలిటీ పరిధి, మక్తలోని చింటు ఇంటి వద్ద మృతురాలి బంధువులు ధర్నా చేశారు. శ్రీరాములు, బాలిక ఐదేళ్లుగా ప్రేమించుకుంటున్నారని మీడియాలో రావడం బాధాకరమని బాలిక తల్లిదండ్రులు, బంధువులు విలపించారు. ఐదేళ్ల క్రితం బాలికకు 11 ఏళ్ల ప్రాయం కూడా ఉండదని, ఆ వయస్సులో ప్రేమ గురించి ఏమి తెలుస్తుందని ప్రశ్నించారు. చింటును ఉరితీయాలని, లేదంటే తామే కొట్టి చంపుతామని హెచ్చరించారు. బాధితులకు న్యాయం చేస్తామని పోలీసులు హామీ ఇవ్వడంతో ధర్నాను విరమించి అంత్యక్రియలు నిర్వహించారు. ఇదిలా ఉండగా పరారీలో ఉన్న చింటు పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయాడని, అనంతరం పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకున్నారని తెలిసింది. మరోవైపు ఘటన ఎలా జరిగింది, ప్రేమ వేధింపులా లేక హత్యా, ఆత్మహత్యా, బ్లాక్ మెయిలింగా అనే కోణాల్లో పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.